


# చరమాంకం

సింహాప్రసాద్


"రామస్వామినాయుడుగారిని పట్నం నుంచీ తీసుకొచ్చేశారట. ఇక బతకడని డాక్టర్లు చెప్పేశారట."

బాలసూర్యకిరణాలు ఆ పల్లెటూళ్ళోని ఇంటింటినీ తట్టకుండానే ఆ వార్త అన్ని ఇళ్ళ తలుపుల్నీ తట్టి మరీ లోపల ప్రవేశించింది.

ఏ ఇంట్లో చూసినా ఏ రేవులో చూసినా ఏ కాఫీ హోటల్లో చూసినా ఆ విషయం గురించే మాట్లాడుకుంటున్నారు.

"అరవయ్యేళ్ళు నిండకుండానే ఆయుర్దాయం నిండి పోయింది కాబోలు" అని కొందరు జాలి పడుతూంటే "ఊరోళ్ళ సొమ్ము తిన్న వాడసలి ఇలాగే తీసుకుని తీసుకుని చస్తాడు. పగ బట్టిన పామైనా కాటు వెయ్యకుండా ఊరుకుంటుందేమో కాని పాపం ఊరుకోదంటారంటకే" అంటూ వ్యాఖ్యానిస్తున్నారు మరి కొందరు.

రామస్వామి నాయుడుగారు సుమారు పాతికేళ్ళ క్రితం వట్టి రామస్వామే. ఊరం పల్లెలో చిన్న బియ్యం కొట్టు పెట్టుకుని రోజుకి అయిదారు కుంచాల బియ్యం, సోలకొలా అమ్ముకుంటూ వాడు.




అలాగాడికి కాస్త దూరపు బంధువూ వూళ్ళో కెల్లా పెద్దమనిషి సంబై ఎకరాల ఆసామీ అయిన అనంతయ్యగారు రోజూ ఆ కొట్టు ముందునుంచే తమ పొలం వెళ్ళి మంచీ చెడ్డా, పొలా నీళ్ళా చూసుకుంటూవుండేవారు. కోడి కూసినప్పుడు వెళ్ళిన వారు తిరిగి బారెడు పొద్దెక్కాకే తిరిగి వచ్చేవారు. అంత ఆస్తి ఉన్నా కూలోడితో భుజం కలిపి చేలో దిగి మరీ పని చేసే వారు తప్ప గట్టుమీద కూర్చుని కబుర్లు చెప్పేవారు కాదు.

ఏదోలా కష్టపడుతూ సంసారం నీడుస్తున్న రామస్వామి అంటే అనంతయ్యగారికి ప్రత్యేకాభిమానం. అందుచేతే పొలం నుంచి తిరిగి వస్తూ వస్తూ అతడిని పలకరించి, వ్యాపారం గురించి అదీ ఇదీ మాట్లాడుతూవుండేవారు.

ఒక రోజున "ఎన్నాళ్ళిలా అపుడూ పోలెడు బియ్యం అమ్ముకుని బతుకుతావు కాని ధాన్యం కమీషన్ వ్యాపారం చెయ్యరాదా. పట్నంలో నాకు తెలిసిన మిల్లు వాళ్ళతో కూడా చెబుతాను" అన్నారు. అనటమే కాదు ఒకనాడు రామస్వామిని తీసుకుని మిల్లు వాళ్ళతో మాట్లాడి పెట్టారు.

అప్పటి నుంచీ రామస్వామి కమీషన్ రామస్వామి అయ్యాడు. రైతులకీ మిల్లర్సుకీ మధ్యవర్తిగా ఉండి బస్తా ధాన్యానికి రూపాయి చొప్పున రైతుల నించీ, అర్థ రూపాయి చొప్పున మిల్లర్స్ నుంచీ సంపాదించే వాడు.

నాలుపల్లె లోని బియ్యం కొట్టు ఎత్తేసి బజారులో కొంచెం పెద్ద కొట్టు పెట్టించాడు కూడా పెద్ద కొడుకుతో.

రోజు రోజుకీ రామస్వామి నాయుడు పుంజు కుంటూ నాలుగు డబ్బులు సంపాదిస్తుండగా మరో సంఘటన జరిగింది.

అనంతయ్యగారు రామస్వామి ద్వారా నూటపదిహేను బస్తాల ధాన్యం అమ్మారు. పదిహేను బస్తాల ఖరీదు వెంటనే ఇచ్చి మిగతాది వారం రోజుల్లో ఇస్తానని నాయుడు చెప్పారు. కానీ అలోగానే అకస్మాత్తుగా అనంతయ్యగారు పడుకున్న వారు పడుకున్నట్టుగానే పోయారు.

శవ దహనం అయ్యాక అనంతయ్యగారి అబ్బాయి: రావు శవకార్యాలకిగాను డబ్బివ్వమన్నారు రామస్వామిని.

"ఏం డబ్బు?" అనాలోచితంగా అన్నాడు.

"మా నాన్న అమ్మిన ధాన్యం బాపతు డబ్బు."

మెరుపులా ఒక ఆలోచన వచ్చింది. వెంటనే "భలే వారే. డబ్బంతా అనంతయ్య మామయ్యకిచ్చేశానే. మీకు చెప్పలేదా?" అన్నారు.

"కొంత ఇవ్వడమే తెలుసు కాని అంతా ఇచ్చినట్టు మాకు తెలీదు. పెట్టెలో కూడా లేదు మరి."

"ఇంకేం చేశారో ఎవరి కివ్వాలని ఇచ్చారో కాని నాలుగు రోజుల క్రితమే మిగతా దంతా ఇచ్చేశాను. అనంతయ్య మామయ్య ఎప్పటి కప్పుడు పద్దులు రాస్తారు గదా—పుస్తకాలు చూడండి తెలుస్తుంది"

"అన్నిటి గురించీ రాశారు కాని ఈ ధాన్యం గురించి రాయలేదు. ఏకంగా ఒక్కసారే రాద్దామనుకున్నారో ఏమో. ఒక్క కాగితం మీద కూడా ఏమీ రాయలేదు."

"అంతా ఇచ్చేశాను కనకనే రాయలేదు. లేకపోతే ఇంకివ్వాలని రాయరా?"

వాళ్ళు మాట్లాడలేకపోయారు. మంచివారి తోనా చెప్పారు. వాళ్ళకీ అదే సమాధానం చెప్పాడు రామస్వామి. పైగా ఆయన వల్లే ఇంతటి వాడ నయ్యాను ఆయనకే ద్రోహం చేస్తానా అంటూ దిన కార్యాల య్యే వరకూ ఆ ఇంటి చుట్టూనే తిరగ డంతో "ఇచ్చేశాడు కాబోలు" అనుకోక తప్పలేదు.

వంద బస్తాల డబ్బు రామస్వామిని ఒక్కసారే పెద్దవాణ్ణి చేసింది. అయినా తన లోని మార్పు మరొకటి వాడికి తెలీ నివ్వలేదు.

ఇంతలో ఒక మిల్లు యజమాని దొంగ నోట్లు ప్రచురించి వాటిని మార్చేస్తే సగానికి సగం ఇస్తానన్నాడు. చిన్న చిన్న రైతులకి ఆ నోట్లు ఇచ్చేస్తే వాళ్ళు గుర్తించ లేరనుకుని ఆయనతో చేతులు కలిపి కొన్ని వేల రూపాయలు చిల్లర నోట్లుగా మార్చేశాడు. కొంత కాలం బాగానే సాగింది కాని అంతలో పట్నంలో గగ్గోలు రావడం, పోలీసులు ఒక ఇద్దరిని అరెస్ట్ చెయ్యడంతో దొంగ నోట్ల వ్యాపారానికి స్వస్తి పలక తప్పలేదు.

అంతేకాదు. డబ్బుని నోట్ల రూపంలో ఉంచడం కంటే ప్రమాదమని కొంత డబ్బుని బంగారంగా మార్చేసి దాచేశాడు గుట్టు చప్పుడు కాకుండా. నాలు గేరం [illegible] దొంగ నోట్ల విషయం పోలీసులకి ప్రాకిందని తెలిసినప్పటినుంచీ వచ్చిన పదిరోజులూ వెధవ కలలు రావడంతో ఒక చిన్న దేవాలయం కట్టించి 'భగవంతుడా! అంతా నీదే భారం" అని ఓ దణ్ణం పెట్టేసి నిశ్చింతగా గాలి పీల్చుకున్నారు.

ఆయన ఆస్తి పాస్తులతోబాటు పలుకుబడి కూడా పెరగటంతో వేషభాషల్లో మార్పు రావడంతో రామస్వామినాయుడల్లా రామస్వామి నాయుడుగారై పోయారు.

ఆయనకి ముగ్గురు మగ పిల్లలూ, ఒక ఆడ పిల్లానూ—అందరి పెళ్ళి ళ్ళయ్యాయి.

పెద్ద కొడుకు బియ్యం కొట్టు చూస్తూనే కమీషన్ వ్యాపారంలో తండ్రికి చేదోడు వాదోడుగా ఉండేవాడు. ఆయన మంచం పట్టి నప్పటినుంచీ ఆ వ్యాపారం అతడే చూస్తున్నాడు.

రెండో కొడుకు అంతా బండవాటం. పొలం పనులు చూస్తూ బాధ్యతా రహితంగా తిరుగుతుంటాడు. ఆ తరువాత ఆరోగ్యం చెడటంతో వ్యాపారాన్ని పెద్ద కొడుక్కి అప్ప చెప్పి తను పర్య వేక్షించ సాగారు. ఆయనకి ఉబ్బసం, బ్లడ్ ప్రెషర్, ఉన్నాయి. మొదటనే తగ్గిపోతాయిలే అని అశ్రద్ధ చేశారు. తరువాత డాక్టర్లకి చూపించి కొన్నాళ్ళు మందులు వాడారు కాని పెద్దగా ఫలితం కనిపించక పోయేసరికి "డబ్బు డాక్టర్లకి పొయ్యడం తప్ప ఈ రోగం తగ్గేనా చచ్చేనా" అనుకుని నిర్లక్ష్యం చేసేసరికి అది కాస్తా ముదిరి కూర్చుంది.

ఇంట్లో వాళ్ళూ వూళ్ళో వాళ్ళూ పోరుతూ ఉంటే వారి గత్యంతరం లేక ఆసుపత్రిలో చేరారు. 'ఆయుష్షు ఉన్నన్నాళ్ళూ బతుకుతాం. అప్పుడు డాక్టర్లు లేనిది ఆయుష్షు నీ పొయ్యలేరు కదా' అన్న అభిప్రాయం గల ఆయన డబ్బెక్కువగా ఖర్చు పెట్టడానికి ఇష్ట పడలేదు. తను దాచిన బంగారం గురించి పిల్లలకి కాని భార్యకి కాని అందుచేతే చెప్పలేదు. వాళ్ళు దాన్ని తన జబ్బుకోసం నీళ్ళలా ఖర్చు పెట్టేస్తారనీ, తన ఇన్నాళ్ళ సంపాదనా డాక్టర్ల పాలవుతుందనీ అనుకున్నారు. ఒక్కసారే అంత బంగారం అందేసరికి పిల్లలు తాగి తందనా లాడి అల్లరి చిల్లరిగా ఖర్చు పెట్టేసి నలుగుర్లో అల్లరి పాలవుతారేమో, తన గుట్టు రట్టు చేస్తారేమో నన్న భయం కూడా లేకపోలేదాయనకి. తనప్పుడే చావ నన్న ధైర్యం కూడా దానికి తోడయ్యింది.

కాని తరవాత రానురాను తన ఆరోగ్యం క్షీణిస్తూ ఉండటం తన్ను మెల్లగా పడేసే సూచనలు కనబడక పోయేసరికి తను దాచిన సొమ్ము గురించి పిల్లలకి చెప్పాలనీ నలుగురి నోళ్ళల్లోనూ పడకుండా జాగ్రత్తగా పంచుకొని వీలైతే మళ్ళీ వూరెళ్ళి పోయి బాగ పడమని చెప్పాలని అనుకున్నారు. కాని ఎప్పుడూ ఆడవాళ్ళో

బయటి వాళ్ళు ఎక్కువ మందే ఉండటంతో చెప్పడానికి వీలు పడ్లేదు. ఆడవాళ్ళ నోట్లో నువ్వు గింజ కూడా నానదు గనుక స్వామి విషయం వాళ్ళకి చెబితే ఊరంతా టాంటాం వేస్తారని ఆయన భయం.

దాచిన బంగారం గురించి కొడుకులకి చెప్పే అవకాశం కోసం ఆయన ఆరాటపడుతుంటే ఆయన ఆరోగ్యం విషమించింది. డాక్టర్లు "ఇలా లాభం లేదు. రెండు మూడు రోజుల కన్నా ఎక్కువ బతకటం కష్టం" అని తేల్చి చెప్పెయ్యడంతో అయినప్పుడే పోయేటట్టు ఏడ్చేగన్నా ఇంటికి తీసుకొచ్చేశారు రాత్రి.

ఆవేళ పగలంతా ఊళ్ళో వాళ్ళు వచ్చి ఆయన్ని చూసి పోతూండటం చూసి ఎదిరిలో కూర్చున్న ఆయన ముగ్గురు కొడుకులూ అసహనంతో ఉండుతున్నారు. ముసలాయన దగ్గర బంగారాలు దాచాడని వాళ్ళకి ఖచ్చితంగా తెలియకపోయినా ఆయన చాలా సంపాదించటం తెలుసు కనుక దాన్ని దాచే ఉంటాడని వారి నమ్మకం. అందుచేతాయన గుటుక్కు మనకుండానే ఆ రహస్యం తెలుసుకోవాలని వారి పథకం — ఆతృత.

ఆ రాత్రి అన్ని తలుపులూ వేసేసి రామస్వామి నాయుడుగారున్న గదిలోకి చేరారు కొడుకులూ, కోడళ్ళూ, భార్యా. ఆ మిగిలిన వారెవ్వరినీ రానీకుండా.

పీనుగుతో సహా సమస్తమూ మంచం మీదే అయిపోతూండటంతో గదంతా వాసనగా ఉంది. భరించరానిదిగా ఉంది. అయినా ఎలాగోలా ఓపిక పట్టి ఆ రహస్యం తెలుసుకోవా లనుకున్నారు.

గోతి కాడ నక్కల్లా అయిదుగురు మంచం చుట్టూ చేరి ప్రేమ ఒలకబోస్తూ మాట్లాడి దాచిన డబ్బు గురించి చెప్పమన్నారు.

'ఒరే పిల్లలూ, అంత ఇదవుతారెందుకురా. నేను కూడబెట్టిందంతా మీకోసమేరా నాయనల్లా. కొంచెం జాగ్రత్తగా వినండి. ఈ గది లోంచి వంటింట్లోకి వెళ్ళే గుమ్మం ఉందే—ఆ గుమ్మానికి కుడి వేపు గోడలో నేలకి నాలుగడుగుల ఎత్తున నాలు గైదు ఇటుకలు తీసేస్తే గోడ లోపల ఇత్తడి బొట్టు పెట్టె కనిపిస్తుందిరా. అందులో పెట్టాన్రా యాభై డెబ్భై తులాల బంగారం. మీరు ముగ్గురూ సమానంగా పంచుకోండి. పిల్ల దానికి కొంచెం ఇవ్వండి. ముసలాడో కంటి వాడికి తెలీకుండా కొంచెం కొంచెం సాయం చేయండి. మీ అమ్మని కంటికి రెప్పలా చూస్తూండండి. మీ పిల్లల్లో ఒకడికి నా పేరు పెట్టుకుని నన్ను గుర్తు చేసుకుంటూండండి. రామాలయాన్ని అశ్రద్ధ చెయ్యకండి. ఏటా నవమి రోజున పానకాలు పొయ్యండి చాలు. నా పెద్ద కర్మ రోజున ఎక్కువ ఖర్చు పెట్టకండి మనమా. ఊళ్ళో వాళ్ళకి అనుమానం వస్తుంది' అని చెప్పాలనుకున్నారు రామస్వామి నాయుడుగారు. కాని చెప్పలేనంత వల్ల ఒక్క మాట కూడా మాట్లాడలేక పోయారు. కళ్ళంట నీళ్ళు ధారాపాతంగా కారిపోతున్నాయ్. నోరు పడిపోయిందని తెలి... ఆయ నింకా మాట్లాడాలని ఒంట్లో మిగిలున్న శక్తి నంతాకూడా తీసుకోవాలని యమయాతన పడుతూ ప్రయత్నిస్తూ విఫల మవుతూ దీనంగా చూస్తున్నారు.

ఎప్పుడు నిధిని చేజిక్కించు కుందామా అని ఆరాట పడుతున్న వాళ్ళు పరిస్థితిని మరోక రకంగా అర్థం చేసుకున్నారు. ఆయన తమకా డబ్బు ఇవ్వడం ఇష్టం లేదని దెప్పి పొడిచి నిందించి కోపంగా వెళ్ళి పోయారు.

అయినా ఆశ చావక ఒకరికి తెలీకుండా ఒక రొచ్చి ఆయన్ని కదలెయ్య చూశారు. ఆయన అశక్తత చూసి విసుక్కుపోయారు.

ఆయన నోరు పడి పోయినందున మాట్లాడ లేకపోతున్నారని గ్రహించిన కూతురు ఇన్ని గ్లాస్కో జీళ్ళాయన గొంతులో పోసి ఆయ నంటే తన కెంత ప్రేమో నిరూపించి డబ్బు రహస్యం చెప్పమంది.

ఆయన గుమ్మం వైపు చూడమని అంతో ఇంతో చేత్తో సైగ చెయ్య ప్రయత్నించగానే ఆయ పెద్దమ్మ మంటున్నారనుకుని పరుగు వెళ్ళి ఆయ్ చేసి వచ్చింది. అయినా ఆయనలాగే ప్రవర్తించే సరికి విసిగి వేసారి "మీకు నా కంటే కొడుకులే ఇష్టం. అంచేత వాళ్ళు విన్నారా పారేసి పోయారు" అని వేళ్ళు త్రిప్పుకుంటూ వెళ్ళిపోయింది.

పది గంటల వేళ మళ్ళీ గదిలోకి వచ్చా రంతా.

"అంతిమ ఘడియల్లో మనిషికి కావేశాలుండ వనీ, దేవుడితో సమానమనీ అంటారు. ఇప్పుడైనా దాచిన డబ్బుని పట్టుకెళ్ళలేవు కదా. అంచేత ఎక్కడ దాచావో చెప్పు—నీ పేరు చెప్పుకుంటాం" పెద్దాడ చిన్నకొడుకు శాంతంగా లౌక్యం ఉపయోగించి.

"బా ... వు ...రి ..." దాని గురించి చెప్పాలని విపరీతంగా ప్రయత్నిస్తూ ప్రయాస పడిపోయారు. కాని నోట్లో నుంచి మాట రావటం లేదు. చేతితో చూపడానికి చెయ్యి లేవడం లేదు!




కన్నీళ్ళు మాత్రం కాల్వలు కడుతున్నాయి.

మరి కొంతసేపు ప్రతిమాలినా లాభం లేక పోయేసరికి నోటితో గాకపోయినా సైగతో నైనా చెప్పనందుకు సహనం కోల్పోయి విసుక్కున్నారు. తిట్టారు.

ఇక ఇలా లాభం లేదనుకుని సందిరి మంచం కోళ్ళలో పెట్టెల్లో అటక మీదా అన్ని చోట్లా వెదికేశారు. కనీసం ఫలానా చోట దాచి ఉంచామన్న చీటీ అయినా దొరుకుతాయని.

ఆఖరికి నిరాశే మిగిలేసరికి "నువ్వేదో పెద్ద మహాత్ముడివని అనుకుంటుంటే త్రిప్పి చేతిలో ఉన్నది అర్పించి నిన్ను నెత్తిమీద పెట్టుకుని పూజించినందుకు బాగా బుద్ధి చెప్పావ్. ఇంకెవర్ని ఉద్ధరిస్తావు గాని చావరా" అన్నారు ఎంతో డబ్బు బంగారం వస్తాయన్న ఆశ ఆశయాలు అడి యాస లయేసరికి.

అవన్నీ ఆయన వినగలుగుతున్నారు. కాని బదులు చెప్పడానికి శరీరంలోని ఒక్క అంగమూ స్వాధీనంలో లేదు!

మర్నాటి నుంచి ఆ గదిలోకి రావటం మానేశా రంతా. కళ్ళనీళ్ళు పెట్టుకుంటూ చాటుగా ఆయన భార్య గదిలో కెళ్ళబోతోంటే కొట్టినంత పన్జేసి గది తలుపులు బిగించేశారు కొడుకులు!

ఆయన నోట్లో ఇన్ని గ్లాస్కో నీళ్ళుగానీ, తులసి తీర్థంగాని పోసేవాళ్ళు లేరు.

ఆయన ప్రక్కబట్ట మార్చే వారు లేరు!

నోరు పిడచ కట్టుకుపోతున్నా, దుర్గంధం భరించ రానిదిగా ఉన్నా ఎలా గోలా సహించ గలుగు తున్నారు గాని వారి నిర్లక్ష్యానికీ బ్రతికుండగానే చచ్చిన వాడ్ని క్రింద జమకట్టిన వారి మనస్తత్వానికి మాత్రం ఆయన క్రుంగి పోతున్నారు.

అయినా ఆయన లోని పిచ్చి హృదయము ఆరాటం దాచిన సొమ్ము గురించి ఎలాగోలా చెప్పాలన్న తపన చావక—మస్తిష్కం ... ఎలా గోలా చెబుదాం చెబుదామని సాయంత్రం వరకూ ఎదురు చూసి చూసి ఇంక బ్రతుకు ప్రతికి ఆఖరికి కనుమూయవు వాళ్ళొచ్చినందుకు గుండెలు పగిలేలా ఏడ్చి ఏడ్చి అనుకున్నారు: "చావబోయినా డబ్బుని పట్టుకుపోనని తెలుసురా. కాని నేను మనిషినిరా. మీరు చేసిన నిర్లక్ష్యాన్ని సహించలేన్రా. మీ బాగు కోసం నానా గడ్డి కరిచి సంపాదించి నేను తిని అనుభవించకుండా దాచి పెట్టినందుకు మా బాగా బుద్ధి చెప్పేర్రా. ఒరేయ్! మీకు చస్తే ఆ బంగారం గురించి చెప్పనుగాక చెప్పను. ఆఖరికి ఎవరికో చెందినా, శతాబ్దాల తరబడి అలా ఉండిపోయినా ఫర్వాలేదు గాని మీకు మాత్రం చెప్పను, చెప్పను, చెప్పను!"

మర్నాటి కాయన పరిస్థితి బాగా క్షీణించడం చూసి ఆఖరి ప్రయత్నంగా మళ్ళీ ప్రతిమాలారు ఆయన వాళ్ళు.

కాని, ఈ సారి ఆయన ఆ విషయం చెప్పడానికి కొంచెం కూడా ప్రయత్నించలేదు.

"ఇంకెందుకీ పీడ? ఇంట్లో చస్తే ఇల్లు పాడు పెడ్తారి. బయటికి తీసెయ్యండి" అన్న పెద్ద కొడుకుని నిర్లిప్తంగా చూశారు రామస్వామి నాయుడు గారు. ★